క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ ఫల రసాలతో విశేష అభిషేకాలు చేశారు. నూతన వస్త్రాలతో అలంకరించారు. తమలపాకులు, సింధూరంతో ప్రత్యేక అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం



సామూహిక సత్యనారాయణ వ్రతం ఆచరిస్తున్న భక్తులు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి గ్రామంలో ఉన్న ద్వాదశ దేవాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు మంగళవారం ఘనంగా జరిగాయి. 150 వరకు జంటలు ఈ వ్రతంలో పాల్గొన్నారు. దేవస్థానం ఎగ్జిక్యూటివ్ అధికారి పర్యవేక్షణలో వ్రతాలు జరిగాయి. పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాలు నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాజారెడ్డి, పరబ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెల్లరాల్చు తెగులుపై అప్రమత్తం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేటలో జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పొలాల్లో చేపట్టిన పంటకోత ప్రయోగాన్ని పరిశీలించారు. పంట పొలాలను పరిశీలించి రెల్ల రాల్చు పురుగులను గమనించారు. తెగుళ్ల దాడుల పట్ల అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంట కోత సమయంలో పురుగులు దాడి చేయడం వలన దిగుబడి తగ్గే అవకాశం ఉందని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి పురుగులను నివారించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

నెల్లిమర్ల: మండల కేంద్రంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)ను భద్రపరిచే గోదాంను జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మంగళవారం తనిఖీ చేశారు. తాళం వేసి ఉన్న గోదాం షట్టర్లను పరిశీలించారు. అనంతరం లాగ్‌బుక్‌లో సంతకం చేశారు. ఆయన వెంట డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, ఆర్‌డీఓ కీర్తి, తహసీల్దార్ సుదర్శనరావు, ఎన్నికల పర్యవేక్షకులు భాస్కరరావు, ఎన్నికల డీటీ జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిశీలన అనంతరం సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. బాలికలు కళాశాలలో ఆరుబయట నేలపై కూర్చొని ఉండడం గమనించిన నేలపై ఎందుకు కూర్చున్నారని ప్రశ్నించారు. గది లోపల చలి ఉందని, ఎండలో కూర్చున్నామని వారు బదులిచ్చారు. అక్కడే ఉన్న ప్రిన్సిపాల్‌ను అపార్ ఐడీ ఎంతవరకు జారీ చేశారని కలెక్టర్ ప్రశ్నించారు. 50 శాతం పూర్తయ్యాయని, ఆధార్ సమస్య వల్ల ఆలస్యం అవుతోందని ప్రిన్సిపల్ మజ్జి సత్యనారాయణ తెలిపారు. అదనపు భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాలని, కళాశాల పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటాలని కలెక్టర్ సూచించారు.

డాక్టర్ అప్పలరాజుకు సన్మానం



డాక్టర్ అప్పలరాజును సన్మానిస్తున్న ఆరోగ్యశ్రీ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్ వైద్యసేవ) జిల్లా కోఆర్డినేటర్‌గా పనిచేసి, ఇటీవల రిలీవ్ అయిన డాక్టర్ ఉప్పు అప్పలరాజును ఆరోగ్యశ్రీ సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆరోగ్య మిత్రలు, టీమ్ లీడర్లు ఆయన్ను సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రింద స్థాయి సిబ్బందితో డాక్టర్ అప్పలరాజు స్నేహపూర్వకంగా మెలిగేవారని, ఆరోగ్యశ్రీలో ఏ సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించేవారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో టీమ్ లీడర్లు తుంపల్లి జనార్దనరావు, భానుప్రసాద్, ఆర్.ముత్యాలనాయుడు, దేవి, ఉమ, సురేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సేవలపై అవగాహన

విజయనగరం అర్బన్: ఎస్‌బీఐ అందిస్తున్న యూనో యాప్ సర్వీలను వినియోగించుకుంటే సైబర్ క్రైమ్ సమస్యలు ఎదురవ్వవని ఆ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం మేనేజర్(ఆర్‌ఎం) ఎం.సురేష్‌బాబు అన్నారు. స్థానిక ప్రైవేటు హోటల్‌లో 'టౌన్ హాల్ మీటింగ్' పేరుతో ఖాతాదారులకు నిర్వహించిన బ్యాంక్ సేవల అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యూనో యాప్ సేవల ద్వారా ఏటీఎం కార్డు లేకుండా నగదు తీసుకోవచ్చని తెలిపారు. ఏటీఎం కౌంటర్‌లో నగదు రాని సమస్యలు ఎదురయితే టోల్ ఫ్రీ 18001234 నంబర్‌కు కాల్ చేస్తే పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఛీఫ్ మేనేజర్ ఏఎస్ త్రిపాఠి, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

సేవే పరమావధి

ఊహించని రైలు ప్రమాదాలు.. ఏం జరిగిందో తెలిసేలోపే మృత్యుఒడికి చేరుకునే ప్రయాణికులు.. కనీసం ఆ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు కడసారి కూడా చూసుకునే అవకాశం లేకుండా ఛిద్రమైన శరీర భాగాలు.. చివరకు అనాథ మృతదేహాలుగా మిగిలిపోవడం చూస్తూనే ఉన్నాం. రైలు కింద పడి నలిగిపోయిన శరీర భాగాల వద్దనే గంటల తరబడి విధులు నిర్వహించడంతో పాటు వాటిని జిల్లా కేంద్రాస్పత్రిలోని మార్చురీకి తరలించడం, చివరగా సమయం మించిపోవడంతో వాటికి దహనసంస్కారాలను సైతం శాస్త్రోక్తంగా నిర్వహించడంలో మగ, ఆడ అనే తేడా లేకుండా విధుల్లో ఉన్న రైల్వే గవర్నమెంట్ పోలీసులు తమ బాధ్యతలను నిర్వహిస్తూ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.



అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న జీఆర్పీ సిబ్బంది(ఫైల్)

- అనాథ శవాలకు అంత్యక్రియలు చేస్తూ..
- జీఆర్‌పీ పోలీసులందిస్తున్న ఎనలేని సేవలు
- గత ఐదేళ్లలో 84 మృతదేహాలకు శాస్త్రోక్తంగా కర్మలు

విజయనగరం క్రైమ్: సుదూర ప్రాంతాల నుంచి జనరల్ భోగీల్లో వేలాడుతూ ప్రయాణం చేసే నిరుపేద రైలు ప్రయాణీకులు ఫుట్‌బోర్డుల వద్ద కూర్చొని కిక్కిరిసి ప్రయాణాలు చేస్తుంటారు. తెల్లవారు ఝామున వచ్చే చల్లని గాలికి నిద్రలోకి జారుకొని టర్నింగ్‌ల వద్దకు వచ్చేసరికి అప్పుడప్పుడు కొంతమంది తూలిపోతుంటారు. అలా నిద్రలోనే వారు మృత్యుఒడిలోకి వెళ్లిపోయిన సంఘటనలు కోకొల్లలు. అలా మృతిచెందిన వాళ్లలో చాలా మంది గుర్తు పట్టలేనంతగా వారి శరీర భాగాలు ఛిద్రమైపోతుంటాయి. కనీసం గుర్తింపు కార్డులు కానీ, రైలు టికెట్‌గానీ లభించకపోవడంతో వారు అనాథ శవాలుగా (అన్ ఐడెంటిఫైడ్ డెడ్ బాడీలు)గానే మిగిలిపోతున్నారు. ఏ మాత్రం చిన్న ఆచూకీ లభించినా రైల్వే జీఆర్‌పీ పోలీసులు సంబంధిత రైల్వేస్టేషన్‌లో ఉన్న పోలీసులకు సమాచారమందించి వారి కుటుంబ సభ్యులకు సమాచారమందిస్తున్నారు. అయితే చాలా మంది సుదూర ప్రాంతం కావడం, నిరుపేదలవ్వడం, చేసేది లేక తిరిగి అంత్యక్రియలు వారినే చేసేయమని చెప్పిన సందర్భాలు లేకపోలేదు. రైల్వే జీఆర్‌పీ పోలీసులు గడిచిన ఐదేళ్లలో 84 మంది అనాథ మృతదేహాలకు అంత్యక్రియలను నిర్వహించారు.

గంటల తరబడి రైల్వేట్రాక్ పక్కనే..

అర్ధరాత్రి సమయంలో ఏ గుర్తు తెలియని రైలు కిందో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినా.. గార్డు, కానీ స్టేషన్ మేనేజర్‌కి వచ్చిన సమాచారంతో అక్కడకు వెళ్లే జీఆర్‌పీ పోలీసులు గంటల తరబడి ఛిద్రమైన శరీరభాగాల వద్దనే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. ఇదంతా ఒక ఎత్తయితే పోలీసుల సమక్షంలోనే ఛిద్రమైన భాగాలను ఏకం చేసి, వాటిని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించడం, పీఎం రిపోర్టు వచ్చేవరకూ బాధ్యతలు చేపట్టడం మరో కోణం.

శాస్త్రోక్తంగా అనాథ శవాలకు అంత్యక్రియలు

తమ కుటుంబంలో ఎవరైనా మృతిచెందితే వారి అంత్యక్రియలకు సాధారణంగా మహిళలు వెళ్లరు. అటువంటిది రైల్వే జీఆర్‌పీలో పనిచేసే మహిళా పోలీసులు సైతం మానవతా దృక్పథంతో ఒక అడుగు ముందుకేసి అనాథశవాలకు అంత్యక్రియలు చేసే కార్యక్రమాల్లో పాల్గొనడం విశేషం. ఎంతో భక్తిశ్రద్ధలతో దైవకార్యక్రమం చేస్తున్న విధంగా శాస్త్రోక్తంగా అనాథ శవానికి కర్మలు నిర్వహిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

సేవ చేయడం అదృష్టం



పోలీసు ఉద్యోగమంటే ప్రజలకు సేవచేయడం. అటువంటిది రైల్వే జీఆర్‌పీలో అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడం ఎంతో అదృష్టంగా భావించాలి. రైల్వేట్రాక్‌ల పైన పడి మృతిచెందిన అన్ ఐడెంటిఫైడ్ మృతదేహాలను 72 గంటల తర్వాత ఖననం చేస్తాం. ఎవరైనా గుర్తించినట్లయితే వారు వచ్చేవరకూ వెయిట్ చేసి వారికి అప్పగిస్తాం. ఆర్‌పీఎఫ్‌లతో కలిసి ఫుట్‌బోర్డుల వద్ద ప్రయాణాలు చేయకుండా నిత్యం ప్రయాణికులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

– వి.బాలాజీరావు, జీఆర్‌పీ ఎస్‌ఐ, విజయనగరం

వైద్య సేవలపై వాస్తవాలు తెలుసుకుంటాం..

- జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రితో పాటు స్థానిక ఘోషాస్పత్రిలో రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవాలు తెలుసుకొని ప్రజలకు, పాలకులకు తెలియజేసేందుకు జిల్లా పౌరవేదిక ప్రత్యేక బృందంతో ఈనెల 29,30 తేదీల్లో ఆస్పత్రుల పరిశీలన చేస్తుందని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి తెలిపారు. మంగళవారం పౌరవేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాకి ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరైనప్పటికీ ప్రజలకు సంతృప్తికర స్థాయిలో వైద్యం అందకపోవడంతో అప్పులు చేసి ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారనిన్నారు. మరోవైపు ప్రభుత్వం ప్రజలకు వైద్యం అందించేందుకు రాజీపడకుండా నిధులు మంజూరు చేస్తున్నట్లు చెపుతోందని, లోపం ఎక్కడ ఉందో అర్థం కావడం లేదన్నారు. జీజీహెచ్‌కు వచ్చే రోగులను విశాఖపట్నం కేజీహెచ్, ఇతర ఆస్పత్రులకు రిఫరల్ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు లేవని రోగులు గగ్గోలు పెడుతున్నారని తరచు పత్రికల్లో అనేక కథనాలు ప్రచురితమవుతున్నాయి. వీటిన్నింటిపై తమ బృందం సమాచారం సేకరిస్తుందని భీశెట్టి తెలిపారు. పూర్తిస్థాయిలో నివేదిక తయారుచేసి జిల్లా కలెక్టర్, జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్‌కు అందచేస్తామన్నారు. సమావేశంలో పౌరవేదిక ప్రతినిధులు రొంగలి పోతన్న, జలంత్రి రామచంద్రరాజు, తుమ్మగంటి రామ్మోహన్, మాతృభూమి సేవా సంఘం నేత ఇప్పలవలస గోపాలరావు, గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు కనకాచారి, అభిషేక్, పట్నాయక్, బాలు, రాజారావు, అప్పారావు, పి.ఎల్.ఎన్.రాజు, గ్రామీణ వైద్యుల సంఘం నాయకుడు గెద్ద చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మూలకుచేరిన నీటిశుద్ధి యంత్రం



జొన్నవలస పాఠశాలలో మూలకుచేరిన నీటిశుద్ధి యంత్రం

విజయనగరం రూరల్: మండలంలోని జొన్నవలస గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తాగునీటి శుద్ధి యంత్రం మరమ్మతుకు గురైనా సంబంధిత ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు గగ్గోలు పెడుతన్నారు. భోజన సమయంలో పాఠశాల బయట ఉన్న చేతిపంపు నీరు తాగాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు మంచి పౌష్టికాహారం, సురక్షిత తాగునీరు అందించేలా చర్యలు చేపట్టిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యార్థుల బాగోగులు గాలికొదిలేసిందని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎంఈఓ రాజు వద్ద సాక్షి ప్రస్తావించగా పాఠశాల అభివృద్ధికి నిధులు ఇటీవలే విడుదల చేయడం జరిగిందన్నారు. ఆ నిధులతో నీటిశుద్ధి యంత్రాన్ని మరమ్మత్తులు చేయించాలని ఉపాధ్యాయులకు సూచిస్తానని తెలిపారు.

జ్యూట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

నెల్లిమర్ల: నెల్లిమర్ల జ్యూట్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకువాలని సీఐటీయూ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. జ్యూట్ యాజమాన్యం ముడిసరుకు(నార) కొరత పేరిట అక్రమంగా లాక్ ఔట్ ప్రకటించిందన్నారు. యాజమాన్య చర్యతో గత 6నెలలుగా కార్మికులు కుటుంబాలతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. జ్యూట్ మిల్ అక్రమ లాక్ ఔట్‌పై జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశామని, దీనిపై విశాఖపట్నం లేబర్ కమిషనర్ వద్ద జాయింట్ మీటింగ్‌కు పిలిస్తే జ్యూట్ యాజమాన్యం గైర్హజరవుతోందని తెలిపారు. యాజమాన్యం నగర పంచాయతీకి సుమారు రూ.6కోట్లు పన్ను బకాయి ఉన్నా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోలేదన్నారు. అదేవిధంగా కొండవెలగాడ సీతమ్మ చెరువు ఆక్రమణపై విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



మహాసభలు గోడపత్రికను విడుదల చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రభుత్వ విద్య పరిరక్షణే ధ్యేయంగా నిర్వహిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.జాన్సన్‌బాబు, కె.శివారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక అమర్‌భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభల బహిరంగ సభ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయనగరం జిల్లాలో ఈనెల 27,28,29,30 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభలకు జాతీయ, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు. ఈ సభల్లో విద్యారంగ సమస్యలుపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ కార్యవర్గ సభ్యులు బాబ్జి, జిల్లా సహాయ కార్యదర్శి గౌరీశంకర్, దుర్గాప్రసాద్, భాను, జ్యోతి, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి

పూసపాటిరేగ: చివరి ధాన్యం గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని రెల్లివలస గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ధాన్యం కొనుగోలులో దళారుల బెడద లేకుండా ప్రభుత్వమే రైతులకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తోందన్నారు. మిల్లుకు ధాన్యం తరలించిన 48 గంటల్లోనే రైతు అకౌంట్‌కు నగదు జమ అవుతుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ తాడ్డి గోవింద, ఎంపీడీఓ ఎం.రాధిక, సివిల్ సప్లై డీఎం మీనాకుమారి, సీఎస్‌డీటీ మురళి, సర్పంచ్ ఇజ్జిరోతు అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

సాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి

నెల్లిమర్ల రూరల్: మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. సతివాడ పీఏసీఎస్ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. రైతులు దళారుల బారిన పడి మోసపోవద్దన్నారు. ఏడీఏ కోటేశ్వరరావు, సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, నాయకులు చనమల్లు వెంకటరమణ, అంబళ్ల అప్పలనాయుడు, గోవిందరావు, పీఏసీఎస్ సీఈఓ సన్యాసప్పుడు, ఏఓ పూర్ణిమ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించడమే అసలైన దేశభక్తి

భారత రాజ్యాంగాన్ని ఆమోదించి మంగళవారం నాటికి 75 ఏళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ విశిష్టను విద్యార్థులకు వివరించారు. పేద, ధనిక బేధాలు లేకుండా అందరికీ సమానంగా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాన్ని ప్రసాదించే కల్పవల్లిగా రాజ్యాంగాన్ని అభివర్ణించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవడంతో పాటు బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించడమే అసలైన దేశభక్తిగా పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విద్యార్థులు, యువత, ఉద్యోగులతో రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ పి.సౌమ్యలత



నెల్లిమర్ల: రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతామని ప్రతిజ్ఞ చేస్తున్న మిమ్స్ వైద్య కళాశాల విద్యార్థులు



నెల్లిమర్ల: డైట్ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ పగడాలమ్మ, తదితరులు



విజయనగరం టౌన్: గాజులరేగలోని నారాయణ స్కూల్‌లో రాజ్యాంగ పీఠిక, అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



భోగాపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు



డెంకాడ: స్థానిక శాఖాగ్రంథాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ మహేష్, పాఠకులు



విజయనగరం: సాకేటి వీధిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ రైట్స్ ఫోరం ప్రతినిధులు



విజయనగరం రూరల్: మండల పరిషత్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి నివాళలర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



నెల్లిమర్ల: మండల పరిషత్ సిబ్బందితో రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

అంగన్‌వాడీ కేంద్రాలకు బోధనోపకరణాల వితరణ

పూసపాటిరేగ: నేటి బాలలే భావితరాలకు మార్గనిర్దేశకులని హెచ్‌బీఎల్ పరిశ్రమ జనరల్‌మేనేజర్ సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని హెచ్‌బీఎల్ పరిశ్రమ ద్వారా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు 16 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం బోధనోపకరణాలు పంపిణీ చేశారు. కొత్తగా మరో 9 కేంద్రాలు కలిపి 40 కేంద్రాల చిన్నారులకు విద్యా సామగ్రి, పుస్తకాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించినట్లయితే శారీరకంగా, మానసికంగా ఎదుగుతారు అన్నారు. పూసపాటిరేగ మండల పరిధిలో 40 అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 500 మందికి పైగా చిన్నారులకు పరిశ్రమ సహకారంతో ప్రతిరోజు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శాంతకుమారి, భోగాపురం ఐసీడీఎస్ సెక్టార్ పీఓ ఎస్తేరురాణి, హెచ్‌బీఎల్ పరిశ్రమ ప్రతినిధిలు సునీల్‌రావ్, రామకృష్ణ, రాజేష్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం అర్బన్: పారిశుధ్య కార్మికులతో సమానంగా ఇంజినీరింగ్, నాన్ పీహెచ్ కార్మికులకు బేసిక్ వేతనం ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసరావును ఫెడరేషన్ ప్రతినిధులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఇంజినీరింగ్, నాన్ పీహెచ్ కార్మికులకు బేసిక్ వేతనం రూ.21 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 3 నెలల హెల్త్ అలవెన్స్ బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. డీఆర్‌ఓను కలిసిన వారిలో ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.జగన్మోహనరావు, నాయకులు బాబూరావు, రామునాయుడు, నారాయణరావు, శ్రీను, అర్జున్, రాఘవ, సురేష్, బాలరాజు, శంకరరావు, పైడిరాజు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు పెద్దపీట

విజయనగరం: నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. మంగళవారం ఆయన ఛాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నగరంలోని పెద్ద చెరువు, అయ్యకోనేరు, నీలాటి చెరువు, కోమటి చెరువులను శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలన్నారు. చెరువుల చుట్టూ ఉన్న నడకదారులను శుభ్రంగా ఉంచాలన్నారు. ఆచంట గార్డెన్ గోడలకు, పెద్ద చెరువు గ్రిల్స్‌కు పెయింటింగ్ వేయించాలని సూచించారు. సమావేశంలో ఎంఈ టి.రాయల్‌బాబు, టెక్నికల్ ఆఫీసర్ పట్నాల వెంకటేశ్వరరావు, డీఈలు ప్రసాద్, మణికుమార్, ఏఈలు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం

విజయనగరం: నగర ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే ధ్యేయమని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కొత్త అగ్రహారం వద్ద ఉన్న వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ప్రతీ 15 రోజులకు ఓసారి ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్నారా లేదా అని ఆరాతీశారు. అలాగే పైపులైన్ లీకులను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రతిరోజు నీటి నాణ్యతను పరీక్షించే క్లోరిన్ టెస్టులు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ప్రజలకు సురక్షిత తాగునీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని సూచించారు.

మాయమాటలు నమ్మొద్దు

భోగాపురం: అపరిచితుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని పోలీసులు హెచ్చరించారు. భోగాపురానికి చెందిన పసుపులేటి నవీన్ అనే వ్యక్తి అనేక మంది వ్యాపారస్తులతో పాటు పలు శాఖలకు చెందిన అధికారులను మోసం చేసి డబ్బులు వసూలు చేస్తున్నట్లు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎస్‌వీ ప్రభాకర్ తెలిపారు.

30న సీజ్ చేసిన ఇసుక వేలం

డెంకాడ: అక్రమంగా రవాణా చేస్తూ వివిధ కేసుల్లో పట్టుబడిన 103.25 యూనిట్ల ఇసుకను ఈనెల 30న డెంకాడ పోలీస్ స్టేషన్ వద్ద వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. 2021 సంవత్సరం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేసిన వివిధ వాహనాలను పట్టుకుని, ఇసుకను సీజ్ చేయడం జరిగిందన్నారు. కోర్టు ఆదేశాల మేరకు తహసీల్దార్ పద్మావతి సమక్షంలో వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు 30వ తేదీ ఉదయం 10.30 గంటలకు జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.

పరిశ్రమల వ్యర్థాలతో భూగర్భజలాలు కలుషితం

పూసపాటిరేగ: మండలంలోని కొణతాలపాలెం సమీపంలో ఉన్న కందివలస గెడ్డలో వ్యర్థజలాలను ఎమ్మెల్యే లోకం నాగమాధవి మంగళవారం పరిశీలించారు. గెడ్డలో పరిశ్రమలు విడిచిపెడుతున్న వ్యర్థజలాల కారణంగా మండలంలోని చాలా గ్రామాల్లో భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయన్నారు. బోర్లు, బావులు, పంటపొలాలు పాడవుతున్నాయని అన్నారు. పరిశ్రమలు విడిచిపెడుతున్న వ్యర్థజలాలను తక్షణమే నిలిపివేయాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. ఆమె వెంట ప్రజాప్రతినిధులు బాలా అప్పలరాజు, కోట్ల రఘు, బి.దుర్గ, జమరాజు, తదితరులు పాల్గొన్నారు.